# వెళ్లిన కొద్దీ రెట్టింపు వడ్లగింజలు

"రాజద్వారే రాజగృహే సర్వదా దిగ్విజయోస్తు. వేదోక్తం పరిపూర్ణ మా-"

"పో - పో. మళ్లీ యిక్కడికి వచ్చావూ? ఎవరోయ్ జవాన్లూ?"

"చిత్తం, మేమడ్డు పెడుతూనే వుండగా, జలగలాగ జారి లోపలికి వచ్చేస్తున్నారు బాబయ్యా"

"దివాన్జీవారి దర్శనానికి-"

"చాల్చాలు, అంగాస్త్రపు గుడ్డా నువ్వూ - చూస్తారేమోయ్!"

"రావయ్యా! మంచిబ్రాహ్మడవే...."

"నేను డబ్బుకోసం-"

"వూరుకో, వూరుకో. ఇంకా తెల్లపోయి చూస్తూ - వినపడదుటోయ్?"

"చిత్తం చిత్తం"

జవానులు వెనక్కి లాగుతూ వుండగా, ఆ బ్రాహ్మడు, ముందుకి రావాలని గింజుకుంటూనే వున్నాడు.

సరిగా యీ సమయానికి, దివాను, మసలందుమీద పూర్తిగా సద్దుకు కూచుని "ఏమిటా అల్లరి?" అన్నాడు.

"ఎవరో పిచ్చిబ్రాహ్మడు, ఏలినవారి దర్శనానికి---"

"ఒక రూపాయ యిచ్చి పంపెయ్యలేకపోయావు టయ్యా?"

"డబ్బక్కరలేదుటండి"

"మరేం కావాలిట?"

"చెప్పలేదండి"

"అడిగావా నువ్వు?"

"లే-ద్-ం-"

"......."

"ఒక అంగాస్త్రపుగుడ్డ కట్టుకుని, మరో అంగాస్త్రపు గుడ్డ కప్పుకుని-"

"అయితే?"

"పిచ్చివాడు మహాప్రభూ!"

"ఎదటికి రప్పించు"

చిత్తం - చిత్తం"

ఒక్క క్షణంలో, ఆబ్రాహ్మడు, ఠాణేదారుకేసి కొరకొర చూస్తూ, దివాన్జీ యెదటికి వచ్చి చేతులు జోడించుకు నుంచున్నాడు.

"ఎవరయ్యా నువ్వూ?"

"మా యింటి పేరు తంగిరాలవారు. నా పేరు శంకరప్పండి"

"ఏమిటి పని?"

"మహారాజులుంగారి దర్శనం చేద్దా మని వచ్చానండి"

"ఏమిటీ?.... ఈ వేషంతోటే?"

"చిత్తం - చిత్తం. ఒక విద్యలో నేను చక్రవర్తిని. విద్యలకు వేషం అక్కరలేదండి"

"ఏ విద్యలో నీ చక్రవర్తిత్వం?"

"చదరంగంలో నండి"

"........"

"తమకి ఆశ్చర్యం అక్కరలేదు. బ్రాహ్మలే కాదు, వెలమలు, తురకలు, చివరికి క్షత్రియులు - ఎవరూ - ఎక్కడా నా ఆట కట్టగలిగినవారు లేకపోయారండి"

"అబ్బా!..... అలాగేం?"

"ఆత్మస్తుతి మంచిది కాదు కానీ - ఒక్కొక్కచోట అది చాలా అవసరంగానే వుంటుందండి. పెద్దాపురం మహారాజులుంగారంటే చదరంగం ఆటలో నిధి అని దిగ్దంతులు ఘోషపెడుతూ వుండడంవల్ల ఒక్క మాటు - వొక్క ఆట - వారితో ఆడాలని-"

"సాధ్యమా?"

"ఏమీ?"

"ఇక చదరంగం ఆడకూడదని నిశ్చయించుకున్నారు ప్రభువు"

"ఎంచేతో!"

"తగిన వుజ్జీ దొరక్క. చివరికి ఆట కట్టడం మాట దేవుడెరుగును, నాలుగెత్తు లేనా వెయ్యగలవాడు కనపడలేదు పృథివిలో"

"చిత్తం"

"కళ్లు తెరవనివాళ్లతో ఆటేమిటని నిరాశ చేసుకున్నారు మహారాజులుంగారు"

"నాతో ఆడిచూడకుండానే?"

"నువ్వేం ఆకాశంమీదనుంచి వూడిపడ్డావా యేమిటి?"

"ఇంకా సందేహమాండి?"

"అబ్బో!"

"తంగిరాల శంకరప్పతో చదరంగం ఆడి జయించగలవాడు ఈ క్షణందాకా భూమిమీద పుట్టలే దండి"

"మహాబాగా కోస్తావే?"

"చిత్తం - చిత్తం. కత్తి చేతిలో వున్నప్పుడు కొయ్యకపోవడం యెలా వస్తుంది మహాప్రభూ?.... అయితే: మొండిపట్టు పట్టి, ఆటలో కూచుని వోడిపోతే, మహారాజులుంగారు, వచ్చినవాడి తలకొట్టించి కోటకొమ్ములకు కట్టించడానికి శపథం పట్టారని తెలుసు. తప్పకపోతే అందుకు సిద్ధమే అని నిశ్చయం చేసుకునే వచ్చానండి"

"అంత సాహసం యేం? పెళ్లయిందా?"

"ఇంటావిడ కాపరం చేస్తూనే వుందండి"

"కలో గంజో తాగుతూ పెళ్లా మనీ, పిల్ల లనీ - యేదో నలుగురితో బాటుగా వుండక యీ పిచ్చివేషం యేమయ్యా నీకూ?"

"విద్యల్లో వుండే వ్యసనం అలాంటిది. అది అందరికీ అవగాహన కాదండి. విద్వత్త వుంటే యిక తిండి అక్కరలేదు. నిద్ర అక్కరలేదు. గుడ్డకూడా-"

"పెళ్ళామో?"

"నిద్రాహారాలు లేకపోయాక యిక పెళ్ళాం యెందుకూ?..... కాని ప్రాజ్ఞత రాకముందే నాకు పెళ్లయిపోయింది. ఇల్లాలు రావడమూ, చదరంగపు వ్యసనం హెచ్చిపోవడమూ వొక్క మాటే-"

"డబ్బు సంపాదించుకు రమ్మని యింటావిడ తరిమిందన్న మాట"

"అదీ వుంది. తమరు కొంతమట్టుకు బాగానే కనిపెట్టారు"

"ఇంకా యేమిటీ?"

"ఉన్నదల్లా అలాగే వుంది.... ప్రతీరోజూ యెవడో వొకడు వస్తూ వుండడమూ, నాలుగో యెత్తు వెయ్యలేక తెల్లపోతూ వుండడమూ - ఇక్కడ, మహారాజులంగారికీ, అక్కడ, నాకూ వొక్కలాగే---"

"ఏమిటీ ఆదురుసుపోలికా?"

"చిత్తం - చిత్తం. సత్యం అన్నది వొక్కొక్కప్పుడు దురుసుగానే వుంటుందండి"

".......''

"అక్కడ యెలాంటివాళ్లూ వొక్క అంతస్థులోనే వుంటారండి... ఇంతకీ తగిన వుజ్జీ దొరక్క యిక్కడ, మహారాజులుంగారికీ విసుపే వచ్చింది. అక్కడ, నాకూ విసుపే వచ్చింది. దీన్ని తమ రేమంటారూ?"

"నీ ఆట లెక్కేమిటయ్యా?"

"ఆ మాటో మరోమాటో అనడానికి అర్హులు మహారాజులుంగారు..... తమరు, వారి దర్శనం చేయించడానికి చాలినవారు. తమ దర్శనానికి కారణం యిదీ"

"ఆలోచిస్తాములే.... వెళ్లు"

"..... కట్టుకోడానికి గుడ్డ కూడా లేనివాణ్ణని తమకు ప్రత్యక్షమే; కాని నాప్రజ్ఞ చూపించడం తప్ప మరేమీ కోరిక లేదు. ఈ విషయంలో తమకేమీ సందేహం అక్కరలేదు. ఓడిపోతే నాతల తీసుకోడానికి కూడా ఏమీ ఆక్షేపణ లేదండి"

"అదెలాగా తప్పదు"
"తెలుసుకోగలిగితే అదీ వొక గౌరవమే నండి"
"ఇంకేం?.... పరిపూర్ణజ్ఞానం కలిగిం దన్నమాటే"
"చాలామంది పెద్దలు కూడా యిలాగే సెలవిచ్చా రండి"
"అయితే, యిక దయచెయ్యి"
".....మళ్ళీ–"
"మేము కబురుచేస్తాములే"
"నాబస–"
"కావాలంటే నీ దర్శనమే దొరక దంటావా యేమిటీ?"
"శంకరప్ప అంటే–"
"ఇక కట్టిపెట్టు..... ఏయ్! జవాన్!"
"చిత్తం బాబయ్యా! నడవ్వయ్యా నడు"

జవానులు శంకరప్ప రెక్కలు పట్టుకున్నారు. శంకరప్ప దివాన్జీ కేసి కోరచూపులు చూస్తూ వెళ్లిపోయాడు.

ఇదంతా అయిన తరవాత, ఠాణేదారు, గుమ్మంలోకి వెళ్లి, తాను దివాన్జీకి కనబడకుండా వుండేటట్టు చూసుకుని, శంకరప్ప కేసి చూస్తూ మీసంమీద చెయ్యి వేసుకున్నాడు.

## 2

"ఏం జరిగింది నాయనా?" అంది పెద్దమ్మ. "వ్యవహారం యెదురుతిరిగిం"దన్నాడు శంకరప్ప.

జరిగిం దంతా విని, పెద్దమ్మ, తనని దద్దమ్మకింద కట్టేసిం దని నిశ్చయించుకున్నా డతను"

"నిజానికి దురుసుమాటలే విడిచిపెట్టాను"
"ముందు మాట యేమాలోచించావూ?"
"మహారాజుతో వొక్క ఆటేనా ఆడాలి; కాని–"
"స్స్! ముందుమాట అడుగుతున్నాను"
"నా కర్థం కావడం లేదు"
"మరి దివాన్జీదగ్గిర అంత దురుసుగా యెందుకు మాట్లాడావు"
"ఆపెద్దమనిషి మొదటే హేళనలోకి దిగాడు. అదివరకే ఠాణేదారు, జవాన్లచేత గెంటించడం నన్ను రెచ్చగొట్టివుంది"
"దివాన్జీ కొంచెం గర్వి. ఉబ్బుదులింగడు. అయినా యీ తాబేదార్లు, తమ తాహతేమిటో, తమ బతుకెలాంటిదో తెలిసి మసలుకోరు"

"......"

"నీ మాట అలా వుండనియ్యి, చదరంగం ఆడేవాడు దొరక్క మహారాజుకి మతిపోయివుంది"

"అంతవరకూ వచ్చిందీ?"

"ఆ సంగతి దివాన్జీకి తెలుసు.... తల యిచ్చెయ్యవలసివచ్చినా సరే అని నువ్వు సిద్ధపడివచ్చినందుకు సంతోషించడానికి బదులు, దివాన్జీ, తెలివితక్కువ–"

"పూర్తిగానూ"

"అబ్బ!.... చివరికి ఫలం?"

"నాప్రజ్ఞ–"

"దిబ్బా దిరుగుండమూనూ, విద్వాంసుల మంటూ వచ్చేవాళ్లని చాలామందిని చూశాను; కాని అంతా యిలాగే, యింగితజ్ఞానం లేక..."

"అసలే మతిపోయివున్నాను. పైగా–"

"అయితే మరి విను. దివాన్జీ తలబిరుసుతనంవల్ల, మహారాజుకి, తగినవాడితో ఆడే యోగం తప్పిపోయింది"

"అలా అన్నావా?"

"పిచికిమీద బ్రహ్మాస్త్రం వేసేశా నని దివాన్జీ కులుకుతున్నాడు కాని అతను చేసింది స్వామిద్రోహం"

"ఇంకా సందేహమా?.... కాని యీసంగతి మహారాజుకి తెలిస్తే బాగుండును"

"అది నీచేవనుబట్టి వుంటుంది"

"అంటే?"

"ఇప్పటిదాకా రాజదర్శనంకోసం నువ్వు తిప్పలుపడ్డావు. ఇక ముందు నీదర్శనంకోసం రాజే తిప్పలుపడాలి"

"ఎప్పుడేనా అది అలా జరుగుతుందా?"

"చెప్పాను కానూ? అది నీ చేవనుబట్టి వుంటుంది"

"తూర్పూ పడమరా నాకేమీ తెలవడం లేదు. అంత యోగమేపడితే ఆటలో రాజుని కియిక్కు మనిపించడం తప్ప నావల్ల మరేమీ కాదు. కనక నీళ్ళముంచినా పాలముంచినా – పెద్దమ్మా! నేను నీకొడుకు ననుకో..."

"దణ్ణం పెట్టనక్కరలేదు నాకు. ఇంత వెర్రిబాగులనాయనవు, చదరంగంలో అంత ప్రజ్ఞ యెలా వచ్చిందోయి నీకూ?"

"ఈశ్వరానుగ్రహం... కాని... చూశావూ? నాప్రజ్ఞ అంతా నీసలహామీద నిలిచివుంది"

"పెద్దాపురపుపట్నం అంతా యెప్పుడేనా చూశావూ!"

"నీయిల్లూ, ఠాణేదారు యిల్లూ, దివాన్జీ యిల్లూ తప్ప మరేమీ యెరగను"

"అలా అయితే ముందు విసుపు లేకుండా పట్నం అంతా తిరుగు"

"తిరిగి?"

"పెద్దమనిషి ననుకునే ప్రతీవాడి సావిట్లోనూ దశావతారీ ఆటో, చదరంగ పెత్తులో జరుగుతూనే వుంటాయి"

"...... బోధపడుతోంది"

"చాలామంది వేశ్యలు కూడా ఆ ఆటల్లో నిధు లున్నారు"

"బాగుంది"

"నీకు పిలుపు అక్కర్లేదు. ఆటకి అడ్డపడు"

"దారి దొరికింది. రెండు రోజుల్లో పట్నంలో వున్న ఆటగాళ్లనందర్నీ కెక్కూ కెక్కూ మనిపిస్తాను"

"ఇంకేం? నువ్వంతపని చెయ్యగలిగావంటే ఆవార్త రాజు గుండెలికి నాటుతుంది"

"సెబాస్!....."

"వుండు. ఎక్కడికి వెడతావూ?"

"పట్నంలోకి"

"భోజనానికి వేళయింది. వొక్క క్షణం వోపిక పట్టు"

"తొందరలేదు. ఆకలికూడా మాయమయిపోయింది. ఒక్కోణ్ణేనా కాళ్లమీద పడేటట్టు చేసుకుంటే కాని యిక నోటికి ముద్దపోదు. క్షణం. ఎంతో సేపా?"

"..... వెళ్ళిపోయాడు. ఎంత చాదస్తం మనిషీ?..... మొగంలో. కళ వుంది. ఓడిపోడు...."

## 3

ఎడాపెడా చూసుకుంటూ శంకరప్ప, సందు మళ్ళాటప్పటికొక అరుగుమీద యిద్దరు బ్రాహ్మలు చదరంగం ఆడుతూ వుండడం కనిపించింది. పక్కల్ని కూచుని యిద్దరికీ చెరో బ్రాహ్మడూ సలహాలు చెబుతున్నారు.

శంకరప్ప, అరుగెక్కి, పక్కని నుంచున్నాడు. అరగడియ దాటినా యెత్తు వెయ్యకుండా వా రలాగే కూచోడం అతనికి విసు పెత్తించింది"

"ఏమండీ, యెత్తు వెయ్యరేం?"

"నీకెందుకయ్యా మాగొడవా?"

"నాకూ కొంచెం తెలుసునండి యీఆట.... మీరెందుకలా కూచున్నారో నాకర్థం కావడం లేదు".

"నాలుగ్గళ్ల పొద్దెక్కాటప్పటికి యీ స్థితికి వచ్చింది ఆట. కాయ కదిపానంటే అట పైసలా. ఎత్తు తోచక నేను కూచున్నాను. నే నెత్తు వెయ్యకపోవడంవల్ల మావాడు కూచున్నాడు.

"ఇంతమంది - ఇంతసేపు - ఏమండీ యిందులో యేం వుందీ?"

"చదరంగం అంటే యేమిటో నీకేమేనా తెలుసునా?"

"నాకే తెలుసును. ఈ మాటకి తిరుగులేదు"

"......"

"చూడనక్కరలేదు. కావాలంటే పరీక్ష చేసుకోవచ్చు"

ఆ బ్రాహ్మడికి శంకరప్ప ఆట చూడాలని సరదా పుట్టింది. దానిమీద "నీ కిష్టమేనా?" అని యెదటి వుజ్జీ నడిగి, "సంయే" అనిపించుకుని, "మరి కూచోవయ్యా" అని శంకరప్పని పిలిచి అతగాడు పక్కకి జరిగాడు.

"మీరు లేవనక్కర్లేదు. నేను చెప్పినట్టు యెత్తు వెయ్యండి"

"అయితే చెప్పు"

"ఎన్ని యెత్తుల్లో ఆట కట్ట మంటారూ?"

"సొరకాయలు నరుకుతున్నావే?"

"నరకడాని కంత సులభమైన వస్తువు మరేమీ లేదని తరవాత మీకే తెలుస్తుంది. ఎత్తులు మాట చెప్పండి"

"నువ్వే చెప్పు"

"ముందు నేనో యెత్తు వేస్తాను. తరవాత వారు వేస్తారు. మళ్ళీ నేను వేస్తాను. అంతే. దాంతో ఆటకట్టు"

"...... మరి కానియ్యి"

"అయితే ఈ శకటుని ఆ గుర్రందగ్గిర వెయ్యండి"

"వేశాను"

"........"

"చూస్తావేమిరా?'

"ఆలోచించుకోనియ్యహోయ్! ఇదంతా నీప్రజ్ఞే అన్నట్టు యెగిసిపడుతున్నావేమిటి?"

"......."

"...... గుర్రా నిక్కడ వేశాను"

"ఆబంటుని కదిపి మీరు తోసి రా జనండీ"

"..... తోసిరాజురా"

"ఆటకట్టు" అని కూడా చెప్పండి"

"ఆటకట్టురా"

"......."

"......"

"ఏ వూరు మహానుభావా మీది?"

"నన్ను చూస్తున్నారా? పొట్ట చేత్తో పుచ్చుకువచ్చాను. అన్ని వూళ్ళూ నావే"

"మీ పేరు?"

"తంగిరాల శంకరప్ప"

"..... ఏమిరా, ఆట కట్టిం దని వొప్పుకుంటావా యెత్తు వేస్తావా?"

"...... చె-బ్తా.... ఈ గుఱ్ఱంతో యీబంటుని కొట్టేస్తే?"

"తెరిచి రాజవుతుందండి"

".... ఈ రాజు నిక్కడ వేశాను"

"శకటు యింటో వేశారండి"

"ఇది యిక్కడ వేస్తే?.... ఇది కొట్టేస్తే?.... పో-నీ.... ఆటకట్టింది. ఒప్పుకున్నానండీ"

"అయ్యా! మీరొక ఆట వెయ్యండి, చూద్దాం"

"చిత్తం....."

"........"

"ముందు మీరు కదుపుతారా నేను కదపనా?"

"మీరే కదపండి"

"చిత్తం.... "

"......."

"అలా వచ్చారా?..... చి-త్తం.... అయ్యా మిమ్మల్ని నాలుగో యెత్తు వెయ్యనివ్వను"

"చూద్దాం, కానివ్వండి"

ఎదటి వుజ్జీ మూడో యెత్తు వేశాటప్పటికి గడియ పట్టింది. నాలుగో యెత్తు పడలేదు. ఆట కట్టింది.

అందరూ తెల్లపోయారు.

"అయ్యా, ఈపూట మీరు మాయింటో భోజనం చెయ్యాలి. మరి తప్పదు"

"ఈపూటకి మాయింటికి వస్తారు. రాత్రి మీయింటికి వస్తారు లేరా?"

"మహానుభావా! మీ రుభయులూ నన్ను క్షమించాలి. మీ అనుగ్రహానికి చాలా సంతోషం. ఎన్నేసి పూటలు మీయిళ్లల్లో భోజనం చెయ్యాలో, అప్పుడే అయిందా? ఇప్పటికి నన్ను విడిచిపెట్టండి. కారణం తరవాత మనవిచేసుకుంటాను"

"మీబస యెక్కడా?"

"పెద్దమ్మ యింటో"

"..... భోజనం చెయ్యగానే రాగలరా?"

"మానెయ్య మంటే భోజనం కూడా మానెయ్యగలను"

"వద్దువద్దు. ఇంతట్లో మేము కూడా భోజనం చేసి వస్తాము. మిమ్మల్నొకచోటికి - అంటే వొక రాజుగారి యింటికి తీసుకువెడతాం. వారితో మీ రెత్తు వెయ్యగలిగితే - తరవాత మాట్లాడుకుందాం కాదూ?"

"తప్పకుండానూ"

ఎవరి దారిని వారు వెళ్ళిపోయారు. "ఇదీ పద్ధతి" అంటూ, పెద్దమ్మ శంకరప్పకి సుష్టుగా భోజనం పెట్టింది.

## 4

"ఇదిగో, భీమసేనరావుపంతులుగారే? ఎప్పుడు దయచేశారు వూళ్లోకి?"

"కాస్సేపు మాట్టాడకయ్యా శాస్త్రులు! పంతులుగారు నా ఆట కట్టెయ్యాలని దీక్షపట్టారు"

"ఎప్పుడు వేశారండి యెత్తు?"

"నేను నిన్న పొద్దున్న వేశాను"

"అ-లా-గా?.... అయ్యా! పంతులుగారూ! కోపం వచ్చినా సరే, ముందు మీరు నామాట చిత్తగించాలి......"

"ఒక్క క్షణం మీరు కూడా చూస్తూ వూరుకోగూడదూ?"

"అలా కాదు. ఒకమాటు ఆటకట్టినా, వొకమాటు కట్టించుకున్నా రాజుగారితో యెత్తు వెయ్యగలవా రీవూళ్లో కల్లా మీరొక్కరే. కానీ - యిలా చూడండీ - ఈయన తంగిరాల శంకరప్పగారు లెండి వీరి పేరు. ఒక్కమాటు వీరిని యెత్తు వెయ్యనివ్వండి. లేకపోతే వీరు చెప్పినట్టు మీరే వెయ్యండి"

"ఏవూరు వారిది?"

"చిత్తం. నా కేవూరూ లేదండి. చెట్టుమీది పక్షిని"

"పిట్టలు కూడా చదరంగం ఆడతాయా?"

"చిత్తం - చిత్తం! "ఆహార నిద్రాభయ మైథునాని - చిత్తగించారూ? పిట్టలు మనుష్యులు చేసే పనులన్నీ చేస్తాయి; కాని యెత్తు వెయ్యడాని కింత సేపు వ్యర్థంగా గడిపెయ్యనండి"

"అలాగేం? ఏదీ, కాయ కదుపూ చూద్దాం..."

"నన్ను పరీక్ష చెయ్యా లంటే మీరు తప్పుకుంటే యే మవుతుందీ?"

"ఏంచెయ్య మంటావూ?"

"అలా కూచుని రాజుగారికి సలహాలు చెప్పండి"

"మరి కానియ్యి....."

".....రాజు నిలా తప్పించా నండీ రాజుగారూ"

"..... వేసి రాజు"

"..... తోసిరాజండి".

ఇలా అంటూ శంకరప్ప బంటుని గెంటాడు. అది రాజు వేసిన శకటు కద్దుతగిలి, పైగా, తోసిరాజుగా తయారయింది.

రాజు ఆశ్చర్యపడ్డాడు. భీమసేనరావుపంతులు తెల్లపోయాడు.

తరవాత, రాజు, బ్రాహ్మణయువకులు కోరగా మూ డాట లాడాడు. చివరి ఆట ముగిశా టప్పటికి రాత్రి భోజనాల వేళ అయింది. కాని వొక్క ఆటేనా రాజు గెలవలేక పోయాడు. పైగా శంకరప్ప వెంటవెంటనే యెత్తు వేస్తూరాగా, రాజు గడియ - రెండేసి గడియ లాలోచిస్తే గాని - భీమసేనరావు కూడా సలహా చెబితే గాని యెత్తు వెయ్యలేకపోయీవాడు.

శంకరప్పా, బ్రాహ్మణయువకులూ వెళ్లిపోయాక పంతులు, రాజుతో కూడా గుమ్మందాకా వెళ్లి "ఇదంతా ప్రతిభ అనే అంటారా మీరూ?" అని అడిగాడు.

"కాకేమీ?"

"ఎన్నటికీ కాదు"

"ఎంచేత?"

"అలాగా.... ఉచ్ఛిష్టగణపతి వుపాసన వుంది ఆ బ్రాహ్మడికి"

"మీ రెలా కనిపెట్టారూ?"

"అంగాస్త్రం కట్టుకుని వున్నాడు చూశారా?"

"సింగినాదం కాదూ?.... మహారాజులుంగారి యెదట మనం యెలా వుంటామో ఆలోచించారా?"

పంతులు, మెట్లు దిగి, "మరి సెలవు" అన్నాడు.

## 5

ఆరాత్రి వూరు మాటు మణిగేదాకా - పెద్దమ్మ విసుక్కునీ దాకా ఆడి, బ్రాహ్మణయువకులు, ఎంతో కష్టంమీద వెళ్లిపోయి, మళ్లీ, సూర్యోదయం అయీ అవడంతోటే తయారయినారు.

ముందు యువకులూ, తరవాత శంకరప్పా బయలుదేరారు. వా రనేక వీధులు దాటారు. అనేకసందులు తిరిగారు. ప్రతీవీధిలోనూ, ప్రతీసందులోనూ అనేకచోట్ల, చాలామంది చదరంగమో, దశావతారో ఆడుతూనే వున్నారు.

ఒకచోట వొక బుగ్గమీసాలరాజు, వొక తురకతో కూచుని చదరంగం ఆడుతున్నాడు. ఒకచోట ఇద్దరు దేవాంగయువకులు చదరంగం కబుర్లు చెప్పుకుంటున్నారు. మరోచోట ముగ్గురు తెలగాలు దశావతారీ ఆడుతున్నారు. కొన్నిచోట్ల కొందరు, లోపల కూచుని చదరంగం యెత్తులు వెయ్యడంలో వచ్చే తగవులూ, కేకలూ వినపడుతున్నాయి.

వెళ్లివెళ్లి వారొక బ్రాహ్మడి యింటో ప్రవేశించారు. అప్పటికప్పుడే ఆ బ్రాహ్మడు - అరవైయేళ్ళు దాటినవాడు, ఒక క్షత్రియ యువకుడితో చదరంగం ఆడుతున్నాడు. ఆట చాలా బిగువుమీద వుంది. ఇద్దరూ ప్రాణాలు పందెం వేసుకుంటున్నట్టు ఆడుతున్నారు. క్షత్రియుడి ఆట కొంచెం లొంగుబాటులో వుంది. యువకులూ, శంకరప్పా చూస్తూ నుంచున్నారు. వారిని వీరుగాని వీరిని వారుగాని పలకరించుకోలేదు.

అరగడియ గడిచాక శంకరప్ప యిక వోపికపట్టలేకపోయాడు. అతనేదో అనాలని నోరు విప్పబోతూ వుండగా వృద్ధబ్రాహ్మడు అతిటెక్కుతో వెనక్కి జేరబడి. "కృష్ణంరాజుగారూ! మీయిష్టంవచ్చిన వారిని సాయంపుచ్చుకోవచ్చు. ఈ పూట మీరు నా ఆట కట్టగలిగితే - అసలు మీ రిప్పు దెత్తు వెయ్యగలిగితే నాగర్వపరిహారానికి మీరేంశిక్షవేసినా వొప్పుకుంటా" నంటూ మూతిబిగించుకున్నాడు.

వచ్చిన నలుగురు బ్రాహ్మణయువకులూ మంచి ఆటగాళ్లే అనీ, (శంకరప్ప నతగా డిదివర కెప్పుడూ చూడనేలేదు) అయినా వారు తన యెదట కూచోడానికే జంకుతా రనీ యెరుగును. అంచేతనే యీగర్వం అతనికి.

దీనిమీద కృష్ణంరాజుకి చాలా పౌరుషం వచ్చింది; కాని ముసలాడు నిజంగా అసాధ్యుడు. సరాసరీ మహారాజులుంగారితో చదరంగం ఆడే గ్రామస్థులు నలుగు రైదుగురిలోనూ అత నొకడు. పోనీ, వచ్చిన వారి సాయం పుచ్చుకుందా మంటే వారు తన తోటే ఆడలేనివారు.

అతని కేమీ తోచలేదు; కాని ముసలాడి ఆట జన్మాని కొక్క మాటేనా కట్టాలి. ఇవాళ తప్పకుండా కట్టాలి.

ఏమీ పాలుపోలేదు. అతని కళ్లు అప్రయత్నంగా శంకరప్పమీదకి తిరిగాయి. ఎందు కనుకుంటూనే "ఏవూరుమీది?" అని అడిగాడు.

శంకరప్ప జవాబు చెప్పలేదు.

అప్పుడొక యువకు డందుకుని "వారి వూరూ పేరూ, అడగవద్దు. వారి సలహాపుచ్చుకోండి. వారు తాతగారిని మూడో యెత్తు వెయ్యనివ్వరు" అని చెప్పాడు.

అది విని ముసలాడు పెంకితనంగా చిరునవ్వు నవ్వాడు. రాజుకది మరింత పౌరుషం కలిగించింది.

యువకులు కూడా కొంచెం పురెక్కారు.

"ఏమండీ, దయచేసి నాకు సలహా చెబుతారా?"

"చిత్తం - చిత్తం....మనవి చేస్తాను. తమరు కదలక్కర్లేదు... అలాగే కూచోండి...."

శంకరప్ప దూరంగా వెళ్లి కూచున్నాడు. అక్కడికి తేరపారి చూసినా బల్ల కనపడదు.

యువకుల కిదేమీ అర్థం కాలేదు. ముసలాడు కూడా బింకంగానే వున్నాడు; గాని అతనిక్కూడా యిదేమీ భోధపడలేదు.

రాజు కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"ఏం, అలా దూరంగా వెళ్లిపోయారేం?

"దగ్గిర కూచుని ఆడ్డానికి తాతగారి యెత్తులో యేమంత చాతుర్యం వుందీ? నేనిక్కడ కూచునే చెబుతాను, మీరు యెత్తు వెయ్యండి"

యువకులు, ముసలాడి పెంకితనానికి సరి అయిన జవాబని సంతోషించారు. "ఇదేదో ఉద్దండపిడుగులా వుంది" అని, రాజు, కొంచెం దిటవు తెచ్చుకున్నాడు.

ముసలాడు శంకరప్పకేసి యెర్రగా చూశాడు.

"చూడండీ, రాజుగారూ! మీరాజుకి ఆగ్నేయంగావున్న మీగుర్రాన్ని వారిరాజు ముందు వెయ్యండీ"

"..... ముందు మనం రాజుని వెనక్కి తగ్గించా లండీ. లేకపోతే ఆట యింకా బిగిసిపోతుంది"

"ముందు గుర్రాన్ని అక్కడ వెయ్యండి చెబుతాను"

".... వేశాను"

"వారు యెత్తువేసాక చెప్పండి"

"......"

"మనం గుర్రం తీసినచోట వారు తమ మంత్రిని వేశారు"

"సరే.... చూడండీ, మీరాజుకి వెనక్కాల - వాయవ్యంగా వున్న శకటుని వారి మంత్రి కంటో పెట్టండి"

"పెట్టాను"

"తరవాత వా రేం చేశారో చెప్పండి"

"......"

"వారు మంత్రితో మన గుర్రాన్ని కొట్టేశారు"

"బాగుంది. చూడండీ. యీమాటు, తీసిన గుర్రం వెనక్కాల వున్న శకటుని వారి మంత్రిమీదకి - తెలిసిందా?"

"వేశాను"

"వా రేంచేశారో చెప్పండి"

"......."

"......."

"......."

"తాతగారు తమ మంత్రిని మన శకటుమీదకి తెచ్చారు"

"ముందు వారికి తెరిచి రాజయింది. అది చూసుకోలేనట్టుంది వారు"

ముసలాడు తెల్లపోయాడు. యువకులు "సెబాస్" అన్నారు. రాజు మీసంమీద చెయ్యి వేసుకున్నాడు.

ముసలాడు కంగారుపడ్డాడు. తప్పుకోడానికి అతని రాజుకి దారి లేదు. అడ్డువెయ్యడానికి జంతువు - బంటుకూడా లేదు.

ముసలాడి ఆట కట్టింది. ఇంతే కాదు. నోరు కూడా కట్టింది.

కొంతసేపటికి పురెక్కి, ముసలాడు, శంకరప్పతో వొక ఆట వేశాడు. కాని యెత్తు వెయ్యలేకపోయాడు. చివరికి "కొట్టి రా" జనిపించుకుని "ఇక లేద్దాం. దేవతార్చనకి వేళ అయింది" అంటూ మాట వినిపించుకోకుండా యింటోకి చక్కాపోయాడు.

రాజు, శంకరప్పని పొగడుతూ యువకులతో గూడా తన యింటికి తీసుకువెళ్లి "మీరు నన్ను దిద్దాలి" అని కోరాడు.

## 6

యువకులికి నిద్ర లేదు. హారం లేదు. ఈ ప్రపంచధోరణే లేదు. వారికి, శంకరప్ప, ఉపాస్యదేవత అయిపోయాడు. అతణ్ణి పెద్దపెద్ద ఆటగాళ్ళదగ్గిరకి తీసుకువెళ్ళడమే వారికి జీవితపరమార్థం అయిపోయింది.

ఒక్క వారం గడిచింది. పెద్దాపురంలో పేరుపడ్డ ఆటగాళ్లంతా శంకరప్పతో ఆడి చిత్తయిపోయారు.

ఇప్పుడు శంకరప్ప వీధిలోకి రావడం భయం. పదులు, ఇరవైలు, ముప్ఫయిలు, యాభైలు అతణ్ణి చుట్టుకుని – "ఒక్క ఆట వెయ్యండీ మేము చూస్తాము" "మాకు మెళుకువలు చెప్పండీ" "మీరీ వూళ్లో వుండిపొండీ" "మీరో మాటు మహారాజులుంగారితో ఆడా లండీ" "మేము దివాన్జీవారికి మిమ్మల్ని పరిచయంచేస్తాం రండీ " ఇలాగ కోరసాగారు.

"తంగిరాల శంకరప్ప" ఇది పట్నం అంతటా రామనామంలా అయిపోయింది.

చూడనివారు "ఎందర్ని వోడించివచ్చాడో? ఎన్నితోడా లున్నాయో? ఎన్ని సింహతలాటం మురుగు లున్నాయో? ఎన్ని వుంగరాలు దొరికాయో? ఎన్ని శాలువులు కొట్టేశాడో?" అనుకొంటూ, చూసి , తమ కళ్ళని తామే నమ్మలేకుండా వున్నారు.

ఆవేశం బాగా లేదని అనేకులు పట్టంచుల చాపు లివ్వవచ్చారు. ఉప్పాడసన్న – జరీ – జామా ర్లివ్వబోయారు. తాపితాలు కొందరు సమర్పించబోయారు. కొందరు శాలువులు కప్పబోయారు; కాని, 'ఊహూ! శంకరప్ప వాటిని పుచ్చుకోలేదు. తాకలేదు. కన్నెత్తి చూడలేదు.

అనేకులు విందులకు పిలిచారు; కాని "ఇప్పుడు కాదు" ఇంతే శంకరప్ప సమాధానం.

"పెద్దమ్మకి చెల్లెలి కొడుకేమోరా" "మేనల్లు డేమోనండీ" మొత్తాని కెవరో చుట్టం అయివుంటా దయ్యా" ఇలాగ ప్రతిపాదనలు జరిగాయి. కాని ఎవరూ నిశ్చయించలేకపోయారు.

❀ ❀ ❀ ❀

మళ్ళీ వొకవారం గడిచింది.

సామంతులు, సేనాధిపతులు, వుద్యోగస్థులు, సంపన్నులు, సరసులు, కోరి తీసుకువెళ్లి శంకరప్పతో చదరంగం ఆడి, ఆటకట్టించుకునీకూడా సంతోషిస్తున్నారు.

ఠాణేదారుకి ఇదంతా వుప్పెనగా తోచింది.

దివాన్జీ చెవులు చిల్లులుపడ్డాయి; గాని అతనిదేమీ యెరగనట్టు ప్రవర్తించసాగాడు. అయితే "రాజుగారే కబురుచేస్తా రేమో కొంపదీసి" అనే భయంమాత్రం కలక్కపోలే దతనికి.

❀ ❀ ❀ ❀

మళ్ళీ యింకోవారం గడిచింది.

శంకరప్ప, బుగ్గమీసాలారాజుతో చదరంగం ఆడుతున్నాడు. సావడి అంతా పౌజుదారులతోటీ, సామంతులతోటీ, వుద్యోగులతోటీ, సంపన్నులతోటీ, ఆటగాళ్లతోటీ, కిటకిటలాడిపోతోంది. ఊళ్లో వున్న మొనగాళ్లంతా రాజుపక్కని కూచుని సలహాలు చెబుతున్నారు.

ఇద్దరు ముగ్గురు వేశ్యలు గోడవార నుంచుని పూటకి టికాణాలేని శంకరప్ప యెత్తులుకి తెల్లపోతున్నారు.

అందరూ రాజదర్బారులో లాగ, ఎవరి స్థానంలోవారు కూచున్నారు. అందరూ, చూపులు మట్టుకు దురుసుగా విడిచిపెడుతున్నారే గాని వొక్కరూ పెదవి కదపడం లేదు. ఒకరిమీద వొకరు పడడం - ఒకర్ని వొకరు మోకాళ్లతో కుమ్మడం, గుసగుసలు, వెకవెకలు - ఏమీ లేవు. వారందరూ మర్యాదలు కోరేవారే. అందరూ ఎదటివాడికి మర్యాద చేస్తే గాని తమ మర్యాద నిలవదని తెలిసినవారే. పైగా ఈసిద్ధాంతం అందరూ తమ చేతల్లో చూపించేవారే.

నిజమే. ఇప్పటి ఆంధ్రులు కారుగా వారు?

సరిగా యిలాంటి సమయంలో మన ఠాణేదారు వచ్చాడు. సరాసరీ అతను శంకరప్ప పక్కకి వెళ్లి నుంచున్నాడు. అది చూసి ప్రముఖులు నలుగురూ "ఏం?" అన్నట్టు పైకి చూడగా - శంకరప్పకూడా చూడగా పెంకితనం కలిసిన వినయంతో - చేతులు మాత్రం జోడించుకొని, "దివాన్జీవారు దర్శనానికి రమ్మని తమతో సెలవిప్పించ మన్నారు" అన్నాడు.

అనుభవపరులు కొందరు "ఇది రాజు గారి ఆహ్వానం" అనుకున్నారు. మరికొందరు "దివాన్జీవారిక్కూడా శంకరప్పగారి ఆట చూడాలని వుబలాటం కలిగింది కామోసు" అనుకున్నారు. తత్వజ్ఞులు కొందరు "దర్శనం యిప్పించమనక, దర్శనానికి రమ్మనడం యేమిటోయ్?" అనుకున్నారు.

చివరి కందరూ శంకరప్పకేసి చూశారు.

శంకరప్పకి మొదట వొళ్లు మండిపోయింది; కాని అక్కడి మహాజనుల సాన్నిధ్యం దాన్ని చల్లార్చివేసింది. అయినా, అతను, గుండెలు రువ్వు మనిపోయేటట్టు

కొరకొర చూస్తూ "నేను రాను. నాకవసరం లేదు." అని పెంకితనంగా జవాబు చెప్పి మళ్లీ ఆటలో నిమగ్ను డైపోయాడు.

ఠాణేదారు తెల్లపోయి వెళ్లిపోయాడు.

అందరూ వులిక్కిపడ్డారు. కొంతసేపటి కొక అధికారి "అలా అన్నారేం?" అని అడగ్గా "దానికి చాలా కథ వుంది. ఒక్క వారం రోజులు వోపిక పట్టండి. జరిగిం దంతా సావకాశంగా - పూర్తిగా మనవిచేసుకుంటాను. ఏమీ దాచను. చెప్పకుండా యిక్కణ్ణుంచి యేవూరు వెళ్ళను" అని శంకరప్ప బదులు చెప్పాడు. మరి కొందరుకూడా లాలించి అడిగారు కాని అత నేమీ జవాబు చెప్పలేదు.

## 7

ఆరాత్రి, యువకులు, శంకరప్పని తీసుకుని వేశ్యావీధికి బయలుదేరారు.

రంగసాని అని వొక చక్కనిచుక్క. పేరుచెప్పడానికి వీలులేని వొక క్షత్రియయువకుడు ఆమె విటుడు. మహారాజు చదరంగం ఆడేటప్పుడు పరికరాలు సమకూర్చి సన్నిధిని వుండవలసిన నలుగురు వేశ్యలలో ఆమె వొకతె:

యువకులు సంగతి అంతా శంకరప్పకి ముందే చెప్పారు.

వీరు వెళ్లి వాకట్లో నుంచునేటప్పటికి గోడ అవతల కూచుని సానీ, సరసుడూ చదరంగం ఆడుతున్నారు. అప్పుడే "మీ ఆట కట్టితీరతా నండీ" అని సాని చాలా పట్టుదలగా అంటోంది.

శంకరప్ప వూరుకోలేకపోయాడు.

"చిరంజీవీ! నీకంత కష్టం యెందుకూ? ఏగదిలో యే కాయవుందో చెబితే నేనిక్కణ్ణుంచే సలహా చెబుతాను. నాలుగెత్తుల్లో నిన్ను గెలిపిస్తాను"

"మీరు తంగిరాల శంకరప్ప గారా యేమిటండీ?

"అవును"

సాని "ఏమండీ! లోపలికి రానిద్దామా?" అంది. కాని సరసు డంగీకరించలేదు. సాని "నేను వారి సలహా పుచ్చుకుంటా" నంది. సరసు డంగీకరించాడు.

ఉత్తరక్షణంలో సాని ఆట యేస్థితిలో వుందో వివరంగా చెప్పింది.

శంకరప్ప, అక్కడే, అలాగే నుంచుని నాలుగు యెత్తులు చెప్పాడు. సరసుడి ఆట కట్టింది.

❀ ❀ ❀ ❀

మర్నాడు పొద్దున్న శంకరప్ప, అప్పుడే స్నానం చేసి, ఆరవేసి వున్న అంగాస్త్రం కట్టుకుంటూ వుండగా సేనాధిపతివచ్చి లోపలికి కబురుచేశాడు.

పెద్దమ్మ "కోటలో పాగా వేశా" వంది. ఇదంతా నీచలవ" అంటూ శంకరప్ప ఆమె కాళ్ళకి మొక్కి వాకట్లోకి వచ్చాడు.

"తమరే కాదూ శంకరప్పగారు?"

"చిత్తం"

"మహారాజులుంగారు తమ దర్శనం కోరుతున్నారు"

"......."

"తమరు ఈ గుర్రం యెక్కి కోటకి దయచెయ్యవలసిం దని నా ప్రార్థన"

"ఈవేషంతోటే?"

"సెల వయితే-"

"నాతాహతు నాకు తెలుసు. నాకున్న బట్టలివీ. కష్టార్జితం తప్ప నేను వాడుకోను"

"తమ రాలాగే రావచ్చు. మహారాజులుంగారు తమకోసం యెదురుచూస్తున్నారు"

"జవానులు - ఠాణేదారులు - దివాన్జీలు - ఇంద రుంటారుగదా యీ వేషంతో దేవిడీలో అడుగు పెట్టనిస్తారా?"

"అందరూ తమకి అడుగులుకి మడుగులొగ్గుతారు"

వేషం చూసి గుర్రం పెంకితనం చూపించింది; కాని తేజస్సుకి ముగ్ధమయిపోయి శంకరప్ప యెదట పిల్లి అయిపోయింది.

❀ ❀ ❀ ❀

ఇంద్రసభను తిరస్కరిస్తూ వున్న పెద్దాపుర రాజభవనంలో, దివాన్జీ దారి చూపుతూవుండగా పుంభావసరస్వతిలాగ ప్రకాశిస్తూ వున్న గోచిపాతరాయడు ప్రవేశించాడు. చతుర్భుజతిమ్మజగపతి మహారాజు సాదరంగా స్వాగతం యిచ్చి ఉచితాసనం చూపించాడు.

ఉపోద్ఘాతం సక్రమంగా ముగిసిపోయింది.

చదరంగంకోసం ప్రత్యేకించబడ్డ గదిలో మహారాజూ, శంకరప్పా యెత్తులు ప్రారంభించారు.

మహారాజు కిద్దరూ, శంకరప్ప కిద్దరూ వేశ్యలు వింజామరలు వీస్తు, శంకరప్ప పోకడలు క్రీగన్నులతో పరకాయిస్తున్నారు.

జాముున్నర పొద్దెక్కింది. మహారాజు నింతసే పే ఆటకాడూ కూచోపెట్టలేదు. అందుకే మహారాజూ, అంతకంటే ముందు వేశ్యలూ ఆశ్చర్యపడుతూ వుండగా, శంకరప్ప, చిరునవ్వుతో శకటుని నొక్కివేశాడు.

చూడగా, మహారాజు రాజు కది గతినిరోధం కలిగించివుంది.

మహారాజు మనస్సు చెదిరిపోయింది. అంచేతకూడా అతని కెత్తు తోచలేదు.

❀ ❀ ❀ ❀

అది మొదలు.

ప్రతీరోజూ పొద్దుటిపూట వొకగడియా, మధ్యాహ్నం వొక గడియా మహారాజూ, శంకరప్పా బల్లదగ్గిర కూచోడం. ఎత్తు తోచక మహారాజూ, చేసేది లేక శంకరప్పా వెళ్లిపోతూ వుండడం.

❀ ❀ ❀ ❀

రోజులు గడిచాయి. వారాలు గడిచాయి. మాసాలు కూడా ఆరు గడిచాయి.

మహారాజు నిద్రాహారాలు విడిచిపెట్టేశాడు. పెద్దాపురం అంతా అట్టుడికినట్లుడికిపోతోంది.

పదవి తక్కువ కావడంవల్ల పౌరుషం కూడా తక్కువ కాగా ఠాణేదారు అప్పుడే ప్రకృతిలో పడిపోయాడు; కాని దివాన్జీ కూలిపోయాడు. అత ననుభవించేది వైభవం కాదు. అధికారమున్నూ కాదు. యమచెర అంటే చాలదు. చిత్రవధ అంటే కూడా హీనోక్తే అయిపోతుంది.

❀ ❀ ❀ ❀

ఏడోమాసం సగం గడిచింది. మహారాజుకి, నిద్రాహారాలు మాని రాచకార్యాలు అశ్రద్ధ చేసే స్థితికూడా వచ్చింది.

తాను, ఇంతటి ఆటగాణ్ణి అగౌరవపరిచి, కొంచెం - పల్చపల్చగా మందలింపులు తినివుండడం. వల్ల ఈసందర్భంలో యేం చెబితే యేం మునుగుతుందో అని చెప్పలేక, చెప్పకుండా వుండలేక తుక్కుతుక్కయిపోతున్నాడు దివాన్జీ.

❀ ❀ ❀ ❀

అప్పుడే సూర్యోదయం అయింది: దేవిడీలో నగారా ఝూమ్మని మోగిపోతోంది. సాలలు బాగుచెయ్యడానికి బయట కట్టివెయ్యబడివున్న మదపుటేనుగులు ఘీంకారాలతోటీ, పారశీకాశ్వాలు సకిలింపులతోటీ అన్నదాతలను ఆహ్వానిస్తున్నాయి.

కోటలో చలిచీమలకు దగ్గర్నుంచీ ప్రబోధం కలిగింది.

సాముగరిడీలు చాలించి, మహారాజు, అప్పుడే స్నానపుగదిలో ప్రవేశించాడు. ఇద్దరు గుబ్బెతలు నూనెజిడ్డు వదలడానికి సుగంధ చూర్ణంతో నలుగుపెట్టారు. ఒకతె కుంకుడు కాయల పులుసు పిసుకుతోంది. మరొకతె నీళ్లు తొరుపుతోంది. ఇంకొకతె మధ్యమధ్య చెయ్యి పెట్టి నీళ్లపాళాలు చూస్తోంది. వేరొకతె సువర్ణకలశం పట్టుకుని గంగాళం దగ్గిర నుంచుని వుంది.

సరిగా యీ సమయంలో, మహారాజు, గుమ్మంలోవున్న యువతిని చూసి "చల్లా జగ్గప్పని తీసుకురా" అని కొంచెం చురుగ్గా చెప్పాడు.

కారణం తెలవక పరిచారిక లింకా కంగారుపడుతూనే వుండగా జగ్గప్ప వచ్చి "చిత్తం మహాప్రభూ!" అంటూ చేతులు జోడించుకు నుంచుని. "నుంచున్న పాళంగా

శంకరప్పగారిని తీసుకురారా" అని మహారాజు చెప్పగా మళ్లీ "చిత్తం మహాప్రభూ" అంటూ వంగి దండాలు పెట్టి, గుర్రం యెక్కి అలంకరించబడ్డ మరో గుర్రాన్ని వెంటబెట్టుకుని వుడాయించాడు.

❀ ❀ ❀ ❀

అప్పుడే స్నానసంధ్యాధులు ముగించుకుని, ఆరవేసిన అంగాస్త్రం కట్టుకుని యువకులతో మాట్టాడుతూ వున్నాడు శంకరప్ప.

"దండాలు బాబయ్యా!"

"శ్రీకృష్ణార్పణం.... ఏమిటోయ్ కబుర్లు!"

"నుంచున్న పాళంగా తీసుకురమ్మని సెలవయింది బాబయ్యా"

శంకరప్పకి చిరునవ్వు వచ్చింది. దాంతో అతను మొగం పక్కకి తిప్పుకుని, కిందికి చూస్తూ వొక్కమాటు శిరః కంపం చేసి, "శంకరప్పగారు గుర్రం యెక్కి వెళ్లరుట. ఏనుగెక్కి వెడతారుట" అని మనవిచెయ్యి మహారాజులుంగారితోటి" అని తలయెగరవేస్తూ చెప్పాడు.

జగ్గప్పకి, అక్కడ మహారాజు ఆజ్ఞకీ అర్థం తెలవలేదు. ఇక్కడ శంకరప్ప జవాబుకీ అర్థం తెలవలేదు. పైగా అతనికి మహారాజుతో పాటు శంకరప్ప కూడా తిరస్కరించడానికి వీల్లేనివాడుగానే వున్నాడు.

జగ్గప్ప, శంకరప్పకోసం తెచ్చిన గుర్రాన్ని అక్కడ వుంచి తన గుర్రం యెక్కాడు. అంతే.

## 8

ఉచితవేషంతో మహారాజు సభాభవనంలో పచారుచేస్తున్నాడు. ఈవేపునా ఆవేపునా నిలిచివున్న వేశ్యలు, ఎవరి దగ్గిరికి వచ్చినప్పుడు వారు, మహారాజుకి వింజామరలు వీస్తున్నారు.

దివాన్జీ వొకపక్కగా నిలిచి భవిష్యత్తు తెలవక కిందామీదా పడుతున్నాడు. శంకరప్ప వస్తే గుర్రాన్ని పట్టుకోడానికి జగ్గప్ప, బైట సిద్ధంగా వున్నాడు. ఠాణేదారు, "ఇటు ఇటు దేవా" అంటూ దారి చూపించడానికి శంకరప్పకోసం మెట్లదగ్గిర నుంచుని వున్నాడు.

నిమిషం వొక మహాయుగంలా వుంది.

❀ ❀ ❀ ❀

శంకరప్ప గుమ్మంలో అడుగుపెట్టాటప్పటికి మహారాజు అమాంతంగా వెళ్లి కౌగిలించుకున్నాడు.

కళ్లు తెరిచి చూశాటప్పటి కిద్దరూ, ఆకౌగిలింతలోనే, సింహాసనం మీదకూచుని వున్నారు.

మహారాజుకీ శంకరప్పకీ కూడా ప్రయత్నపూర్వకంగా కంఠాలు సవరించుకోవలసివచ్చింది.

"శంకరప్పగారూ"

"ఏం సెలవు జగత్ప్రభూ!"

"తమరు మా ఆట కట్టేశా రండీ"

"నా మీద కలిగిన అనుగ్రహంవల్ల తమ రలా సెల విస్తున్నారు మహాప్రభూ! ఏలినవారికి నా బాల్యచాపల్యం చూపించడానికి వచ్చానే గాని ఆట కట్టడానికి నేనెంతటివాణ్ణి మహారాజా?"

"అలా కాదండీ. మేము వోడిపోయాము. ఈ విషయం ఆనందంతో - గర్వంతో మేము మనవి చేసుకుంటున్నాము"

"......"

"చదరంగంలో మిమ్మల్ని గెలవగలవాడు నభూతో నభవిష్యతి. తమ చేతిలో అపజయం పొందినందుకు కూడా మేము గర్వపడుతున్నాము"

"వత్సవాయివారి సౌజన్యానికి ఏలినవారి మాటలు గుర్తుగా వున్నాయి. పట్టుపట్టి ఇలాంటి జగత్ప్రభువుతో చదరంగం ఆడి నేను సిగ్గుపడుతున్నాను, నన్ను క్షమించవలసిం దని నా ప్రార్థన మహాప్రభూ!"

"ఇలాంటి ఆనందం మా కిదివరలో కలగలేదు. ఇకముందున్నూ కలగబోదు. ఇందుకు గురుతుగా తమర్ని మేము సత్కరించవలసివుంది. పెద్దాపురసంస్థానంలో వున్న యేదేనా సరే తమకి దాఖలు చేసుకుంటాము, సెల విప్పించండి"

"నాకు బహుమానమా జగత్ప్రభూ! ఎత్తువెయ్యగలవాడు దొరక్క చదరంగం ఆడడానికి మొగంవాచిపోయి వచ్చాను. దేవేంద్రుని అధఃకరించే ఏలినవారితో ఆడాను. తృప్తి అయింది. నా బతుకున్నూ సఫలం అయింది. నాకింకేమీ బహుమతీలు అక్కరలేదు, జగత్ప్రభూ!"

"తమరు విద్యను విక్రయిస్తున్నా రని కాదు మేము మనవి చేసేది. తమరు కళాకుశలులు. కళలను గౌరవించడం రాజుల ధర్మం. బీదతనం తమ ప్రజ్ఞ కేమీ అడ్డురాలేదు. ఇప్పుడు మేము చేసే బహుమానంవల్లనే తమరు సంతోషిస్తారనిన్నీ కాదు. విద్యార్థులకు కళలమీద ప్రీతి కలగా లంటే, ప్రభువులు, కళాకుశలులను సత్కరించడం చాలా అవసరం. ఇప్పు డేనా మా అభిప్రాయం-"

"జగత్ప్రభువులతో వాదించడం అనుచితం. సిద్ధపడినా నే నందుకు సమర్థుణ్ణి కాను"

"తమ అభీష్టం-"

"నేను నిరుపేదను. నిరుపేదలకు కూడూ, గుడ్డా - ఇంతకంటే మరేమీ అక్కర్లేదు. వీటిలో తాము ఒక్క అన్నం పెట్టిస్తే చాలు నాకు."

"తమ కోరిక సెలవివ్వండి"

"నాకు కావలసింది అన్నం, నా యిష్టక్రీడ చదరంగం"

"చిత్తం"

"చదరంగానికి అరవైనాలుగు గదులు. మొదటిగదిలో వొక వడ్లగింజ, రెండోగదిలో దానికి రెట్టింపు, మూడోగదిలో దానికి రెట్టింపు, అనగా నాలుగు వడ్లగింజలు. ఇలాగ గదులు వెళ్లిన కొద్దీ రెట్టింపుచేస్తూ వడ్లగింజలు దయచేస్తే నాకంతె "చాలు మహాప్రభూ"

"చిత్తం. మనం మళ్లీ మధ్యాహ్నం కలుసుకుందాం"

"చిత్తం జగత్ప్రభూ"

ఇద్దరూ సింహాసనం దిగారు. "లెక్క కట్టించండీ" అని దివాన్జీతో చెప్పి మహారాజు వాసగృహానికి వెళ్లిపోయాడు. "మహానుభావా! దయచెయ్యండి" అంటూ ఠాణేదారు, శంకరప్పని గుఱ్ఱందగ్గిరకు తీసుకువెళ్లాడు.

## 9

ఇక జాముపొద్దుంది.

సభాభవనం అంతా కిక్కిరిసిపోయివుంది.

ఉప్పాడ జరీబట్టలతోటీ, కాశ్మీరదేశపు దుశ్శాలువులతోటీ, సింహతలాటపు మురుగులతోటీ, మకరకుండలాలతోటీ, బంగారపు గోవతాడుతోటీ, రవ్వల ఉంగరంతోటీ అలంకరించబడివున్న శంకరప్పని చెయ్యిపట్టుకు తీసుకువచ్చి, మహారాజు, సింహాసనం అలంకరించాడు. వెంటనే సభ్యులంతా జయధ్వనులు చేశారు.

అప్పుడు దివాన్జీ, మహారాజు ఇంగితం కనిపెట్టి "వడ్లగింజలు లెక్కకట్టాను మహాప్రభూ! వారు కోరిన కోర్కె తీర్చాలంటే పెద్దాపురరాజ్యం చాలదు జగత్ప్రభూ?" అని చెప్పాడు. అది విని శంకరప్ప చిరునవ్వుతో మొగం వంచుకున్నాడు. మహారాజు నిర్విణ్ణు డయిపోయాడు.

దివాన్జీ లెక్కకట్టిన కాగితం మహారాజు యెదట వుంచాడు. అది చూసి మహారాజు "శంకరప్పగారూ! ఈ విషయంలో కూడా మేము వోడిపోయాము" అన్నాడు.

అదివరకే వుజ్జాయింపుగా లెక్కకట్టి యీ విషయంలో కూడా శంకరప్ప చూపించిన చాతుర్యానికి చాలా ఆశ్చర్యపడుతూ వున్న సభ్యులు కొందరు మహారాజు నిరాడంబరతనూ, సత్యనిరతినీ చాలా శ్లాఘించారు.

కొంచెంసేపు తీవ్రాలోచన చేసి, మహారాజు "శంకరప్పగారూ! ఇంతవరకూ వత్సవాయివారిలో యెవరూ మాట తప్పియెరగరు. మేము పెద్దాపురరాజ్యం అంతా తమకి దాఖలు చేసుకుంటున్నాము" అన్నాడు. ఇది విని సభ్యులలో చాలామంది చాలాకటకటపడ్డారు. దివాన్జీకూడా చాలా విచారించాడు. అప్పుడు ఇదంతా

గ్రహిస్తూనే వున్న శంకరప్ప "జగత్ప్రభూ! ఏలినవా రిందాకా సెలవిచ్చింది వొకటీ, యిప్పుడు సెలవిస్తూవున్నది వొకటీని" అన్నాడు.

"ఎలాగా?"

"ఏలినవారు "పెద్దాపురరాజ్యంలో వున్న దేది కావలసినా నాకు దయచేయిస్తా మన్నారు; గాని పెద్దాపురరాజ్యమే దఖలుపరుస్తా మని సెలవివ్వలేదు"

"......."

"కనక జగత్ప్రభువులవారు ఒక బ్రాహ్మడు నిర్విచారంగా జీవించడానికి తగినంత వృత్తి దయచేయిస్తే అదే నాకు మహామేరువు"

శంకరప్ప మాటలు విని సభవారందరూ చాలా హర్షించారు. దివాన్జీ మొగంమీద మొదట సంతోషమూ తరవాత మళ్లీ సిగ్గూ అంకిత మయినాయి. తరవాత, కొంతసేపు ప్రశంసలూ, కొంతసేపు వినోదాలూ, కొంతసేపు ఆలోచనలూ జరిగాయి.

మరికొంతసేపు నృత్య వినోదాలున్నూ జరిగాయి.

చివరికి మహారాజు, "శంకరప్పగారూ" తమకు మేము సర్వలక్షణ సంపన్నమైన వొక అగ్రహారం సమర్పించు కుంటాము. తాము కోరినచోట, కోరిన గ్రామం స్వాధీనపరుస్తాము. ఆందోళి కాదిపరివార మంతా యేర్పాటు చేస్తాము. తాము పెద్దాపురంలోనే వుండి యెప్పుడూ మాకు చదరంగవినోదం కలిగిస్తూ వుండవలసిం"దని కోరుతూ సభ చాలించాడు.

(ఈ కథ జరిగిందే అని వినికిడి. కాని కల్పనా, రచనా మట్టుకు నావీ.

– సుబ్రహ్మణ్యశాస్త్రి.)

***(ప్రబుద్ధాంధ్ర - సెప్టెంబరు, 1935)***